## క్లుప్తంగా

### ఫొటోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేర్స్‌లో ఉచిత శిక్షణ

**కడప కార్పొరేషన్ :** కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేర్స్, సర్వీసింగ్ (30రోజులు), సీసీ టీవీ కెమెరా ఇన్‌స్టాలేషన్, సర్వీసింగ్ (13రోజులు) కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఎన్. నారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల చెందిన యువకులకు ఈనెల 16 నుంచి శిక్షణ ఇవ్వనున్నామన్నారు. 18–45 ఏళ్లలోపు వయసు కలిగిన నిరుద్యోగ యువకులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తిగల వారు ట్రైనింగ్ సెంటర్ ఈ మెయిల్‌కు వివరాలు పంపవచ్చన్నారు. వివరాలకు 9440905478, 6302833548 నంబర్లకు ఫోన్ చేయవచ్చన్నారు.

### ‘సయ్యద్’ కార్పొరేషన్‌పై హర్షం

**కడప కల్చరల్ :** ముస్లింలలోని సయ్యద్‌ల ఆర్థిక, సామాజికాభివృద్ధి కోసం ప్రత్యేకంగా ‘సయ్యద్’ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంపై ఏపీఎస్ సజ్జాద్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి అక్మల్ పీరాన్ మురాది సాహెబ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం సయ్యద్‌ల ఆర్థిక, సామాజికాభివృద్ధితోపాటు విద్య, ఉద్యోగ రంగాల్లో కూడా వారికి మంచి అవకాశాలు కల్పించనుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నిర్ణయం సయ్యద్ వర్గాలలో ఎంతో ఆత్మవిశ్వాసం నింపిందని పేర్కొన్నారు. ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఇందుకు సహకరించిన ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఖాదర్‌బాషాకు ధన్యవాదాలు తెలిపారు.

### ఆప్‌కీ ఆవాజ్ మహాసభలను జయప్రదం చేయాలి

**కడప వైఎస్ఆర్ సర్కిల్ :** మే చివర్లో జరగనున్న ఆప్‌కీ ఆవాజ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆప్‌కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్ బాషా పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని ఆప్‌కీ ఆవాజ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దేశ ప్రధాని మోదీ బేటీ బచావో బేటీ పడావో అని హితోక్తులు చెబుతున్నా ఆయన శిష్యులు మాత్రం మైనార్టీలపై దాడులకు పాల్పడటం సరికాదన్నారు. ఈ సమస్యలపై రాష్ట్ర మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఆప్‌కీ ఆవాజ్ నాయకులు ఆరిఫ్ ఖాన్, అబిద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

### కారల్ మార్క్స్‌కు నివాళి



కారల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఆర్‌సీపీ నాయకులు

**కడప వైఎస్ఆర్ సర్కిల్ :** కారల్ మార్క్స్ అడుగుజాడలే ప్రపంచ ప్రజలకు దిక్సూచి అని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రవిశంకర్ రెడ్డి పేర్కొన్నారు. కారల్ మార్క్స్ వర్ధంతి సందర్భంగా మంగళవారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ నాయకులు మగ్బూల్ బాషా, లక్ష్మీదేవి, ప్రసాద్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

### ఈ పంట నమోదుపై సామాజిక తనిఖీ



కాలువపల్లె గ్రామసభలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి నాగరాజ

**గోపవరం :** మండలంలో రబీలో సాగు చేసిన వివిధ పంటలకు సంబంధించి ఈ–క్రాప్ నమోదు చేసిన జాబితాపై గ్రామసభల ద్వారా సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ తెలిపారు. మంగళవారం మండలంలోని కాలువపల్లె రైతుభరోసా కేంద్రంలో ఏఓ అరవిందనాయక్‌తో కలిసి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ నుంచి 17వ తేదీ వరకు అన్ని రైతుభరోసా కేంద్రాల పరిధిలో పంట నమోదు జాబితాపై సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా ఆర్బీకేల పరిధిలో పంట నమోదు చేయించుకున్న రైతుల వివరాలను చదివి వినిపిస్తామన్నారు. ఏయే పంటలు ఎంత విస్తీర్ణంలో సాగు చేశారనే విషయం గ్రామసభ ద్వారా తెలియపరిచి ఏవైనా అభ్యంతరాలు ఉంటే రైతుల నుంచి స్వీకరిస్తామని తెలిపారు. 18వ తేదీ తుది జాబితా విడుదల చేస్తామన్నారు.

### ముగిసిన యోగా మహోత్సవం

**పోరుమామిళ్ల :** గత మూడు రోజులుగా పోరుమామిళ్లలోని గుడుగుంట్ల అపార్ట్‌మెంట్‌లో నిర్వహిస్తున్న యోగా మహోత్సవం మంగళవారం రాత్రి ముగిసింది. కేంద్ర సాంస్కృతిక శాఖ, రామచంద్ర మిషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న యోగా మహోత్సవం నేపథ్యంలో పోరుమామిళ్లలో హార్ట్‌ఫుల్‌నెస్ ట్రైనర్ సత్యప్రవీణ్ ఆధ్వర్యంలో మూడు రోజులు విజయవంతంగా కొనసాగింది.

# నులిపురుగుల నివారణలో భాగస్వాములు కావాలి



జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా మాత్రలు పంపిణీ చేస్తున్న అధ్యాపకులు, ఆరోగ్య సిబ్బంది



వల్లూరులో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు తినిపిస్తున్న అడిషనల్ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వల్లీ

**వైవీయూ :** విద్యార్థులందరూ ఆల్‌బెండోజల్ మాత్రలు వేసుకుని నులిపురుగుల నివారణలో భాగస్వాములు కావాలని కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.సుబ్బలక్షుమ్మ కోరారు. సోమవారం కడప నగరంలోని కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా కళాశాల విద్యార్థినులకు ఆల్‌బెండోజల్ మాత్రలు పంపిణీ చేశారు.

**ఆర్ట్స్ కళాశాలలో..**

**వైవీయూ :** కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఆల్‌బెండోజల్ మాత్రలు పంపిణీ చేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం. రమేష్, జిల్లా ఆరోగ్యశాఖ సమన్వయ అధికారి డా.వెంకటచంద్రారెడ్డి నులిపురుగుల నివారణ ఆవశ్యకతను వివరించారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

**వల్లూరు:** నులి పురుగుల వలన రక్త హీనత వస్తుందని వీటిని నివారిద్దాం అని అడిషనల్ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వల్లీ తెలిపారు. జాతీయ నులి పురుగుల నివారణా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలో మంగళవారం 19 సంవత్సరాల లోపు వయసు గల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యార్థులకు మాత్రలను తినిపించి ప్రారంభించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఫణీంద్ర, సీహెచ్ఓ వేణుగోపాల్‌రావు, హెల్త్ సూపర్ వైజర్ శివరామిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

**చింతకొమ్మదిన్నెలో..**

**చింతకొమ్మదిన్నె :** మండలంలోని బుగ్గలేటిపల్లి, మూలవంక గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మంగళవారం డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి. రవికుమార్‌రెడ్డి, ఎంఈఓ వెంకటరామిరెడ్డి, వైద్యులు రాఘవేంద్ర, సూపర్ వైజర్లు మోహన్‌రెడ్డి, షన్ముగం తదితరులు పాల్గొన్నారు.

**చెన్నూరు:** మండలంలోని రామనపల్లి, రాచిన్నాయపల్లె ప్రైమరీ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన నూలిపురుగురుల నివారనోత్సవ కార్యక్రమాలను పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చెన్నారెడ్డి పరిశీలించి మాట్లాడారు. మండలంలో 43 ప్రభుత్వ, 8 ప్రైవేటు పాఠశాలలు, 52 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వీటిలో 6,693 మంది పిల్లలు ఉన్నారని, వీరిలో 6,104 మంది పిల్లలకు మాత్రలను మింగించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వంశీకృష్ణ, ఎంపీడీఓ గంగనపల్లి సురేష్‌బాబు, ఎంఈఓ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# విజయదుర్గాలయంలో రాహుకాల పూజలు

**కడప కల్చరల్ :** కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో ప్రతి మంగళవారంలాగానే ఈసారి కూడా రాహుకాల పూజలు నిర్వహించారు. భక్తుల సంఖ్య ఊహించని విధంగా పెరగడంతో ఆ ప్రాంగణంలో చోటు చాలలేదు. రాహుకేతువు గ్రహ ప్రభావంతో ఏర్పడే బాధలు తొలగిపోతాయన్న విశ్వాసంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు విశేష సంఖ్యలో ఈ పూజలకు హాజరయ్యారు. ఆలయ ప్రధాన అర్చకులు భక్తులకు పూజా విధానాన్ని వివరిస్తూ కార్యక్రమం నిర్వహింపజేశారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు తెలిపారు. నిర్వాహకులు దుర్గాప్రసాద్‌భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



విశేష అలంకారంలో శ్రీ విజయదుర్గమ్మ



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

# మనోళ్లు.. ఫుట్‌బాల్ చాంపియన్‌లు

**అభినందించిన క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారి**

**కడప స్పోర్ట్స్ :** విశాఖపట్నంలో ఈనెల 8 నుంచి 11 వరకు నిర్వహించిన 2వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల ఫుట్‌బాల్ సీనియర్ ఉమన్ చాంపియన్‌షిప్ పోటీల్లో వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన బాలికల జట్టు చాంపియన్‌గా నిలిచింది. ఈ జట్టులో క్రీడాపాఠశాలకు చెందిన 11 మంది క్రీడాకారిణులు పాల్గొని జట్టును విజయపథంలో నడిపించడంలో కీలక పాత్ర పోషించారు. ఫైనల్‌మ్యాచ్‌లో గుంటూరుపై 7–0 గోల్స్ తేడాతో ఓడించి ట్రోఫీని కైవసం చేసుకున్నారు. క్రీడాపాఠశాల క్రీడాకారిణుల ప్రతిభపై ప్రత్యేకాధికారి ఎస్. బాషామోహిద్దీన్ హర్షం వ్యక్తం చేశారు. జాతీయస్థాయి పోటీల్లో సత్తాచాటాలని ఆకాంక్షించారు. ఉత్తమ శిక్షణ అందించిన ఫుట్‌బాల్ శిక్షకుడు ఎం.హరిని ప్రత్యేకంగా అభినందించారు.



ఫుట్‌బాల్ చాంపియన్‌లుగా నిలిచిన క్రీడాకారిణులను అభినందిస్తున్న ప్రత్యేకాధికారి బాషామోహిద్దీన్

### విద్యార్థులు సరైన మార్గంలో నడవాలి

**కడప ఎడ్యుకేషన్ :** విద్యార్థులు సరైన మార్గంలో నడిచినప్పుడే ఉత్తమ మార్కులు సాధించడానికి వీలవుతుందని సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం చెమ్ముమియాపేట బాలికల ఉన్నత పాఠశాలలో సేవ్ ది చిల్డ్రన్స్ సంస్థ సన్ ఫౌండేషన్ సహకారంతో స్టెమ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సేవ్ ది చిల్డ్రన్స్ సంస్థ సీనియర్ మేనేజర్ సుధీర్, రమేష్‌లతోపాటు ప్రాజెక్టు కో ఆర్డినేటర్ రంగయ్య సిబ్బంది పాల్గొన్నారు.

### వ్యక్తిగత పరిశుభ్రత అవసరం

**కడప ఎడ్యుకేషన్ :** పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థి తమ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని నగరపాలక కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్, జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నాగరాజు సూచించారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మున్సిపల్ ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నాగరాజుతో కలిసి విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి ప్రభాకర్‌రెడ్డి, ఆర్‌బీఎస్‌పి పీఓ వెంకట చంద్రారెడ్డి, ప్రోగ్రాం మేనేజర్ వెంకటరమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### స్థలం విషయమై ఘర్షణ

**కడప అర్బన్:** కడప నగరంలోని తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం తారకరామానగర్‌లో గోవిందు, శాంతమ్మ అనే ఇద్దరు ఘర్షణ పడ్డారు. ఇరువురి ఫిర్యాదుల మేరకు వేర్వేరుగా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఉలసయ్య తెలియజేశారు.

# హక్కుల సాధనకు ఉద్యోగుల పోరాటం

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** ఏపీ జేఏసీ అమరావతి అసోసియేషన్ పిలుపు మేరకు ఉద్యోగుల హక్కుల సాధన కోసం పోరాటం చేస్తున్నామని ఆ సంఘం జిల్లా చైర్మన్ జీవన్ చంద్రశేఖర్, జనరల్ సెక్రటరీ కేపీ శ్యామూల్ రొనాల్డ్ తెలిపారు. మంగళవారం ఈ మేరకు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పోరాటం ప్రభుత్వంపై కాదని, ఉద్యోగుల హక్కుల సాధన కోసమేనని స్పష్టం చేశారు. ప్రభుత్వంలో ఉద్యోగులు భాగమని చెబుతున్న ప్రభుత్వం ఉద్యోగుల వేదనను ఆలకించాలని కోరారు. తమ పట్ల సానుకూలంగా వ్యవహరించాలని వారు కోరారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

# లాడ్జీలలో పోలీసుల తనిఖీలు

**కడప అర్బన్ :** ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి కడప చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్ఐలు ఎస్‌కే రోషన్, అమర్‌నాథ్ రెడ్డి లాడ్జీల్లో విస్తృతంగా తనిఖీలు చేశారు. కడప ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్ఐ మధుసూదన్ రెడ్డి, టూటౌన్ పరిధిలో ఎస్ఐ సంజీవరాయుడు తమ సిబ్బందితో కలిసి ప్రతి లాడ్జీని క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు ఉంటే వారి సమాచారాన్ని నిర్వాహకులు తెలియజేయాలనీ కోరారు. ప్రతి ఒక్కరికీ తమ గుర్తింపు కార్డులతోనే గదులను ఇవ్వాలనీ, సంబంధిత రికార్డులను ఎప్పటికప్పుడు నిర్వహించాలనీ సూచించారు. ఏవైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



లాడ్జీలను తనిఖీ చేస్తున్న చిన్నచౌక్ ఎస్ఐ ఎస్‌కే రోషన్

# స్కీం వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

**కడప వైఎస్ఆర్ సర్కిల్ :** ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగ సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ. 26 వేలు ఇచ్చి ప్రభుత్వ పథకాలను వర్తింప జేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలో పని చేసే స్కీం వర్కర్లకు కనీస వేతనాలు సంవత్సరాల తరబడి అమలుకు నోచుకోవడం లేదన్నారు. ఈ సమస్యలపై ఈ నెల 17న విజయవాడలో నిర్వహించే మహా ధర్నాను జయప్రదం చేయాలన్నారు. ఏఐటీయూసీ నాయకులు వేణుగోపాల్, కేసీ బాదుల్లా, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



మెడల్స్ సాధించిన విద్యార్థులు

**ప్రొద్దుటూరు కల్చరల్ :** స్థానిక మైస్పేస్ తైక్వాండో అకాడమి క్రీడాకారిణి బి.అభినయ ఇటీవల విశాఖపట్టణంలో జరిగిన రాష్ట్రస్థాయి 5వ క్యాడెట్ తైక్వాండో పోటీలలో ప్రతిభ కనబరచింది. 59 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించి ఈనెల 27 నుంచి 30 వరకు రాజస్థాన్‌లో జరగనున్న జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైంది. అలాగే అండర్ 45 కిలోల విభాగంలో షణ్ముఖ రజతం, 51 కిలోల విభాగంలో ఇర్ఫాన్ కాంస్య పతకం సాధించారు. వీరిని కోచ్ సలీం, జిల్లా తైక్వాండో అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాయబ్‌రసూల్, ఉపాధ్యక్షుడు మహబూబ్‌బాషా, ఇన్‌స్ట్రక్టర్ సంతోష్ అభినందించారు.

# హెచ్‌ఐవీపై అవగాహన పెంచుకోవాలి

**మైదుకూరు :** ప్రతి ఒక్కరూ హెచ్‌ఐవీపై అవగాహన పెంచుకోవాలని చైల్డ్ ఫండ్ లింక్ వర్కర్ స్కీం ప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు తెలిపారు. మండలంలోని మిట్టామానుపల్లె ఎస్సీ కాలనీలో మంగళవారం రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో చైల్డ్ ఫండ్ ఇండియా వారు హెచ్‌ఐవీ, టీబీ, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్‌ఐవీ సోకిన వారు ఏఆర్టీ మందులు వాడుతూ జీవితకాలాన్ని పొడిగించుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చిన్న ఓబుళమ్మ, చైల్డ్ ఫండ్ ఇండియా ప్రతినిధులు దర్బార్, షహనేర్ భాను, సచివాలయ ఉద్యోగులు విజయలక్ష్మి, చంద్రావతి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సచివాలయ ఉద్యోగులు

### దరఖాస్తుల ఆహ్వానం

**జమ్మలమడుగు :** ప్రభుత్వ ఐటీఐలో మూడునెలల పాటు స్వల్పకాలిక శిక్షణకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని మైలవరం, జమ్మలమడుగు ప్రభుత్వ ఐటీఐల ప్రిన్సిపాల్స్ మత్తైఫులు, నవరూప్‌కుమార్‌లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి కౌసల్య విద్య యోజన(పీకేవై) పథకం ద్వారా తదితర కోర్సుల కోసం అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈనెల 25వ తేదీలోపు సర్టిఫికేట్లతోపాటు అధార్‌కార్డు, కలర్‌ఫొటో తీసుకుని వచ్చి ఐటీఐలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

# ముగిసిన మొల్ల సాహితీ జయంతి ఉత్సవాలు

**గోపవరం :** మహాకవయిత్రి మొల్లమాంబ సాహితీ జయంతి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయని సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొల్ల సాహితీ జయంతి ఉత్సవాల్లో మొల్ల రామాయణం వ్యాప్తితో పాటు విద్యార్థులు, మహిళల్లో చైతన్యం వెల్లివిరిసిందన్నారు. ఈ నెల 7వ తేదీన గోపవరంలో ప్రారంభమైన మొల్ల సాహితీ జయంతి ఉత్సవాలు వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో ఏడు చోట్ల విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఉత్సవాల్లో కవులు, పండితులకు మొల్ల సాహితీ సేవా పురస్కారాలు ప్రదానం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సాహితీపీఠం ప్రధాన కార్యదర్శి మనోజ్‌కుమార్, సభ్యులు కృష్ణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ముగింపు సభలో మాట్లాడుతున్న గానుగపెంట హనుమంతరావు

### నూతన కోర్టు నిర్మాణానికి సహకరించండి

**నందలూరు(రాజంపేట) :** హైకోర్టు పోర్టుపోలియో జడ్జి జయసూర్యను నందలూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలో న్యాయవాదులు కలిశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు దాసరి నరసింహులు మాట్లాడుతూ నందలూరు కోర్టు నూతన భవనాల నిర్మితం చేయాలని కోరామన్నారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు గొబ్బిళ్ల సుబ్బరామయ్య, నాయనపల్లె అనుదీప్, చంద్రమోహన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

# ఒంటిపూట బడులను నిర్వహించాలి

**ఎస్టీఎఫ్ డిమాండ్**

**కడప ఎడ్యుకేషన్ :** రాష్ట్రంలో ఎండ తీవ్రత అధికంగా ఉందని.. ప్రతి ఏటాలాగే మార్చి 15 నుంచే ఒంటిపూట బడులను నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు రామాంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం కడపలోని ఎస్టీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకులు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎండలు బాగా పెరిగాయిని విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా ప్రభుత్వం సత్వరమే చర్యలు తీసుకుని ఒంటి పూట బడులకు అనుమతులు ఇవ్వాలన్నారు. ఎస్టీఫ్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాజు యాదవ్, నాయకులు రామోహ్మన్, వినోద్‌కుమార్, హరిరామకృష్ణ, లక్ష్మిచౌడయ్య, వెంకటేశ్వరు తదితరులు పాల్గొన్నారు.

# నేడు రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికలు

**కడప కోటిరెడ్డిసర్కిల్:** దక్షిణ మధ్య రైల్వే కడప రైల్వే ఇన్‌స్టిట్యూట్ భవన్ ఎన్నికలు బుధవారం నిర్వహించేందుకు రైల్వే అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్, దక్షిణమధ్య రైల్వే మజ్దూర్ యూనియన్‌ల మధ్య ఈ ఎన్నికల్లో పోటీ నెలకొంది.

250 మంది రైల్వే అధికారులు, సిబ్బంది ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది. రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ తరపున డీఎన్ రెడ్డి, ఈశ్వరయ్య, ఉమర్‌బాషా, మజ్దూర్ యూనియన్ తరుపున మధు, సంజిత్, సుబ్బయ్యలతోపాటు సభ్యులు కూడా పోటీ చేస్తున్నారు. ఓటింగ్ అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టి సాయంత్రం ఎన్నికైన వారిని ప్రకటించనున్నారు. ఈ ఎన్నికలకు అడిషనల్ డివిజనల్ ఇంజనీరు (ఏడీఈఎన్) రాధాకృష్ణ అధికారిగా వ్యవహరించనున్నారు.

# సచివాలయాల తనిఖీ

**పెండ్లిమర్రి :** మండలంలోని వెల్లటూరు, పాతసంగటిపల్లె గ్రామ సచివాలయాలను మంగళవారం డివిజనల్ అభివృద్ధి అధికారి వెంకటసుబ్బయ్య ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం వెల్లటూరు హైస్కూల్‌ను తనిఖీ చేసి హైస్కూల్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. అలాగే విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు లక్ష్మీపతి, కిరణ్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పాతసంగటిపల్లె సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ వెంకటసుబ్బయ్య

# లయోలా పాల్‌టెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

**పులివెందుల టౌన్ :** ఈనెల 11, 12వ తేదీలలో హైదరాబాద్‌లో జరిగిన నాల్గవ సౌత్ ఇండియా జోనల్ ఇంటర్ పాల్‌టెక్నిక్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్‌లో పులివెందుల లయోలా పాల్‌టెక్నిక్ విద్యార్థులు విజేతలుగా నిలిచారని కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ బ్రిట్టో తెలిపారు. మంగళవారం స్థానిక లయోలా పాల్‌టెక్నిక్ కళాశాలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టేబుల్ టెన్నిస్‌లో కమలాకర్ ప్రథమ స్థానం, 200 మీటర్ల పరుగు పందెంలో దినేష్‌కుమార్, లాంగ్ జంప్‌లో బానుప్రకాష్ రెడ్డి ద్వితీయ స్థానాలలో నిలిచారన్నారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ విజయరాజు, కళాశాల పీఈటీ గంగాధరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, తదితరులు

# శారీరక ఎదుగుదలపై విద్యార్థినులకు అవగాహన

**బద్వేలు :** పోరుమామిళ్లలోని ప్రభుత్వ పాఠశాలలో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్, మదర్‌థెరిసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థినులకు శారీరక ఎదుగుదల, రుతుక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వైద్యురాలు డాక్టర్ మౌనికరెడ్డి, ట్రస్టు ప్రతినిధి ప్రజ్వలరెడ్డిలు మాట్లాడుతూ పరిశుభ్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని, మంచి ఆరోగ్యం కోసం చక్కని పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. ట్రస్టు ప్రతినిధులు తోమస్‌రెడ్డి, గీతాఏరువ సహకారంతో విద్యార్థినులకు రుతుక్రమంపై కామిక్స్ రూపంలో తయారు చేసిన పుస్తకాలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో అమెరికా నుంచి విచ్చేసిన దంపతులు జేమ్స్‌గిల్‌క్రిస్ట్, జీనాలు పాల్గొని విద్యార్థులతో ముచ్చటించారు.



పుస్తకాన్ని విద్యార్థినికి అందజేస్తున్న జీనా

# హుండీ ఆదాయం రూ.10.29 లక్షలు

**రాజుపాళెం :** మండలంలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన వెల్లాలలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వామి ఆలయాల్లోని హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. పర్యవేక్షణ అధికారి శివయ్య, ఈఓ బీవీ నరసయ్య, ఆలయ చైర్‌పర్సన్ కానాల విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి ఆధ్వర్యంలో హుండీలను లెక్కించారు. ఆరు నెలలకు గాను రూ.10,29,159 ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ రామ్మోహన్, రామచంద్రారెడ్డి, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

**హుండీ ఆదాయం లెక్కింపు**

**ప్రొద్దుటూరు కల్చరల్ :** స్థానిక అగస్త్యేశ్వరాలయంలో మంగళవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఆలయంలోని ప్రధాన ఆలయాలు, ఉప ఆలయాలు, గోశాలలోని హుండీలను లెక్కించగా మూడు నెలలకు గాను రూ.2,11,079లను భక్తులు కానుకల రూపంలో సమర్పించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఏసీ శంకరబాలాజీ, నంద్యాల దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



రాజుపాళెం : వెల్లాల పుణ్యక్షేత్రంలో హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు